# తెదేపాతోనే సీపీఎం!

న్యూఢిల్లీ, హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా, తెరాసలతో కలిసి వెళ్లడానికి సీపీఎం సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ కేంద్ర కమిటీ అనుమతి ఇచ్చింది. సోదర సీపీఐని ఒప్పించిన తర్వాతే దీనిపై బహిరంగ ప్రకటన చేయాలని నిర్ణయించింది. గత మూడు రోజులుగా కోల్‌కతాలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశాల్లో... నవంబర్‌లో జరగనున్న ఆరు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలతోపాటు, ఆతర్వాత జరుగబోయే లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి ప్రధానంగా చర్చించారు. అమెరికా అనుకూల కాంగ్రెస్, మతతత్వ భాజపాలను ఓడించడానికి సహజ స్నేహితులను కలుపుకొని ముందడుగు వేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలపై విస్తృత చర్చ జరిగినట్లు సమాచారం.

కాంగ్రెస్‌ను ఓడించడానికి తెదేపా, ప్రరాపాల్లో దేంతో కలిసి వెళ్లాలనే విషయమై లాభనష్టాల గురించి విశ్లేషించినట్లు తెలిసింది.

ఢిల్లీలో మన్మోహన్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా తెదేపా, తెరాసలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశాయి. తర్వాత రాష్ట్రంలోనూ సీపీఎంతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయి. ఇటీవల తెదేపా తెలంగాణం అందుకోవడంతో తెదేపా, తెరాసల మధ్యకూడా జత కుదిరింది. ఈ నేపథ్యంలో తెదేపాతో

- కేంద్ర కమిటీ నిర్ణయం
- సీపీఐని ఒప్పించాకే బహిరంగ ప్రకటన

కలిసి వెళ్లడమే మంచిదని సీపీఎం రాష్ట్ర నాయకత్వం కేంద్ర కమిటీకి నివేదించింది. కేంద్ర కమిటీ కూడా సమర్థించింది. ఇదే విషయాన్ని పార్టీ ముఖ్యనేత ఒకరు ధ్రువీకరించారు. తెలుగుదేశంతో కలిసి నడిచేందుకు సీపీఐ తటపటాయిస్తున్నందున దానికి నచ్చజెప్పి ఒప్పించిన తర్వాతే బహిరంగ ప్రకటన చేయాలని కేంద్రకమిటీ నిర్ణయించినట్లు సమాచారం.

కేంద్ర కమిటీ సమావేశాలు ముగిసిన అనంతరం ప్రకాశ్ కారత్ విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికలకు సన్నాహాలు చేసుకోవాలని రాష్ట్ర కమిటీలకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పొత్తుల విషయంలో ఎలా వెళ్లాలో చెప్పామని, కొన్ని పార్టీలను ఒప్పించాల్సి ఉన్నందున బహిరంగంగా ప్రకటించలేక పోతున్నామని తెలిపారు.

నవంబర్ 1, 2 తేదీల్లో సీపీఐ కార్యవర్గ సమావేశాలు జరిగే లోపు ఆ పార్టీ నేతలను ఒప్పించాలని సీపీఎం నేతలు యోచిస్తున్నారు. తెలుగుదేశంతో వెళ్లడానికి సీపీఐ జాతీయ నాయకులకు అభ్యంతరం లేదు. రాష్ట్ర కార్యదర్శి నారాయణ, మరికొందరు నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. చిరంజీవితో మూడో కూటమి ఏర్పాటు చేయాలన్న నారాయణ అభిప్రాయంలోనూ క్రమంగా మార్పు వస్తున్నందున, ఆయన్ను ఒప్పించడం పెద్ద కష్టమేమీ కాబోదని సీపీఎం నాయకులు విశ్వసిస్తున్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పొత్తుల గురించి చర్చిస్తారు. బర్దన్, డి.రాజా హాజరు కానున్నట్లు తెలిసింది. ఆలోపు సీపీఎం నేతలు కేంద్ర కమిటీ చర్చల సారాంశాన్ని సీపీఐ రాష్ట్రనేతలకు వివరించి, ఒప్పించే ప్రయత్నం చేస్తారని సమాచారం. ఆ తర్వాత తెరాస నాయకత్వం దృష్టికీ విషయాన్ని తీసుకెళ్లి, తర్వాత బహిరంగ ప్రకటన వెలువరిస్తారు.

## కుదిరితే పోటీ నివారణ

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు భాజపాయేతర లౌకిక పార్టీలన్నీ సహకరించుకోవాలని, పొత్తులు కుదరని పక్షంలో పరస్పర పోటీని నివారించుకోవాలన్న ప్రతిపాదననూ పెట్టాలన్న ఉద్దేశంతో ఉంది. సీపీఎం మొదటి నుంచీ ఈ ప్రతిపాదనను చెబుతూ వస్తోంది. చంద్రబాబు మంగళవారం ప్రకాష్ కారత్, బర్దన్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. సీపీఎం పొలిట్ బ్యూరో నిర్ణయాన్ని అడిగి తెలుసుకున్నారు. పొత్తుల నిర్ణయం సానుకూలంగా తీసుకున్నా సీపీఐతో కలిసి బహిరంగ పరుస్తామని కారత్ తెలిపారు.